క్లుప్తంగా

నేడు ఉత్తమ జీపీలకు అవార్డుల ప్రదానోత్సవం

మంచాల: మంచాల మండల కార్యాలయంలో గ్రామస్థాయి జాతీయ పంచాయతీ అవార్డులను ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.00 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు గాను 18 గ్రామ పంచాయతీలకు ఈ అవార్డులు రావడం జరిగిందని ఎంపీడీఓ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకాగలరని కోరారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: ప్రభుత్వం పేర్కొన్న థీమ్‌ల వారిగా మండలంలో అత్యుత్తమ సేవలు అందించిన గ్రామ పంచాయతీలకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కారాలు అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలకు మధ్యాహ్నం 2 గంటలకు మండల కార్యాలయంలో పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

తండాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



గిరిజనులతో రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: తండాల అభివృద్ధికి ఐక్యతా ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా పరిధిలోని గుడితండాలో గురువారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. తండాలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండాలో ఆలయ నిర్మాణానికి, నిరుపేద దీప్లానాయక్ ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడిగడ్డ తండా ఉప సర్పంచ్ మల్లేశ్, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు సురేశ్‌రెడ్డి, చంద్రశేఖర్, తండావాసులు తావునాయక్, లోక్యానాయక్, చంద్రునాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని ఆదిత్యానగర్ కాలనీలో పోచమ్మగుడి నిర్మాణ పనులకు గురువారం స్థానిక కౌన్సిలర్ పుల్లగుర్రం కీర్తన విజయానందరెడ్డి, కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేనారెడ్డి, మాజీ అధ్యక్షుడు సతీష్, సభ్యులు యాదగిరి, జంగయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.


మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి: ఎంపీడీఓ



మొక్కలను పరిశీలిస్తున్న రామకృష్ణ

కడ్తాల్: నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా, గోవిందాయిపల్లి గ్రామ పంచాయతీలోని వన నర్సరీ, పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, ఎవెన్యూ ప్లాంటేషన్లను గురువారం ఎంపీడీఓ సందర్శించారు. ఈ యేడాది హరితహారంలో మండలంలోని ప్రతి గ్రామంలో 10వేల మొక్కల చొప్పున 24 జీపీల్లో మొత్తం 2.40 లక్షల మొక్కలు నాటడమే టార్గెట్‌గా పెట్టుకున్నామన్నారు. జూన్ నాటికి మొక్కలు సిద్ధంగా ఉంటాయన్నారు. ఈజీ ఎస్ సిబ్బంది, కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి ఉన్నా రు.

కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయం



కిష్టారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎడ్మ కిష్టారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీలు రమణ, వాణీదేవి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఎఎస్ఎస్ ఫంక్షన్‌హాలులో గురువారం దివంగత మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి జయంతి వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్మ కిష్టారెడ్డి చిత్రపటానికి నేతలు నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

సంతలో సమస్యల తిష్ట

- కడ్తాల్ వారాంతపు సంతకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం
- వసతుల కల్పన పట్టని జీపీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, ప్రజలు



గాంధీనగర్ వీధిలో కొనసాగుతున్న సంత

కడ్తాల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే వారంతపు సంతలో సమస్యలు తిష్టవేశాయి. ప్రతి సంవత్సరం గ్రామ పంచాయితీ అధికారులు తైబజారు ద్వారా వచ్చే ఆదాయంపై మాత్రమే దృష్టి సారిస్తున్నారని.. క్రయ విక్రయదారులకు సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం శ్రద్ధ కనబరచడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే వారాంతపు సంతకు చుట్టూ ఉన్న 30–40 తండాల నుంచి, వివిధ గ్రామాల నుంచి వందలాది మంది వచ్చి వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. గ్రామంలోని ప్రధాన వీధిగా ఉన్నా గాంధీనగర్ వీధిలోనే ఈ సంత (అంగడి) సాగుతూ వస్తోంది. సంత కోసం ప్రత్యేక స్థలం లేకపోవడంతో రహదారి ఇరుపక్కన గల దుకాణ సముదాయాల ముందే చిరువ్యాపారులు కూరగాయలు, పండ్లు వివిధ రకాల వస్తువులు విక్రయిస్తుండటంతో ఆయా దుకాణ యజమానులతో చిరువ్యాపారులకు తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీనికితోడు గాంధీనగర్ రహదారి ఇరుకుగా ఉండటంతో సంతరోజు రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు.

ఏటా రూ.లక్షల్లో ఆదాయం

గ్రామ పంచాయతీకి సంత ద్వారా ప్రతి ఏడాది ఆదాయం పెరుగుతూనే ఉంది. 2020–21లో తైబజార్ వేలంపాట నిర్వహించగా రూ.4.87 లక్షల ఆదాయం సమకూరింది. 2021–22లో రూ.7.37 లక్షలు, 2022–23లో రూ.8.18 లక్షలు తైబజారు ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరం 2023–24 కూడా తైబజారు ద్వారా గ్రామ పంచాయితీకి ఆదాయం భారీగా సమాకూరే అవకాశం ఉంది. ప్రతి ఏడాది సంతకు తైబజార్ ద్వారా ఆదాయం పెరుగుతున్నా వసతుల లేమి క్రయ విక్రయదారులను వేధిస్తోంది. క్రయ విక్రయ దారుల సమస్యలను పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి.

వర్షం వస్తే తడవాల్సిందే..

ప్రధానంగా సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం కేటాయించకపోవడం, సంతలో ప్రత్యేకంగా ప్లాట్ ఫారాలు లేక పోవడం, నేల మీదనే ప్లాస్టిక్ కవర్లు పరిచి సరుకులు, కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షం కురిస్తే సంతలో నీరు వెళ్లే మార్గం సరిగా లేకపోవడంతో కూరగాయలు, వస్తువులు తడిచి వ్యాపారులు నష్టాల పాలవుతున్నారు. సంత జరిగే ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్లు కూడా లేవు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పాలశీతలీకరణ కేంద్రం, మూత్రశాలలు నిర్మించినప్పటికీ సంత జరిగే ప్రదేశానికి దూరంగా ఉండటం, జాతీయ రహదారి దాటాల్సి రావడంతో అంత దూరం వెళ్లలేక ఇక్కట్లు పడుతున్నారు. సంత బజారులో బోరుమోటార్ వద్ద నీటి ట్యాంకు ఏర్పాటు చేసినా నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. తాగునీటి వసతి, మూత్రశాలలు, సంత నిర్వహణకు శాశ్వత స్థలం కల్పించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. కాగా శుక్రవారం తైబజార్ వేలంపాట నిర్వహించనున్నారు.

మూత్రశాలలు లేవు



సంతలో మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు, క్రయ విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయితీ అధికారులు తైబాజార్ వేలంపాట మీద పెట్టే దృష్టి వసతుల కల్పనపై పెట్టకపోవడం దారుణం. వెంటనే సంతలో మూత్రశాలలు నిర్మించి, తాగునీటి వసతి కల్పించాలి. సంతకు అన్ని వసతులతో కూడిన ప్రత్యేక స్థలం కేటాయించాలి.

– శ్రీనునాయక్, పెద్దారెడ్డి చెరువుతండా

తాత్కాలిక షెడ్లు నిర్మించాలి



కూరగాయలు కొనేందుకు వివిధ గ్రామాల నుంచి సంతలో వచ్చే ప్రజలకు తాగునీరు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతలో వివిధ రకాల కూరగాయాలను విక్రయించే వారి వద్ద తైబజారు రుసుం ఖచ్చితంగా వసూలు చేస్తున్నా సౌకర్యాల కల్పనలో మాత్రం దృష్టి పెట్టకపోవడం బాధాకరం. వర్షం వస్తే కూరగాయలు, వస్తువులు తడిచి నష్టం వస్తోంది. ప్లాట్‌ఫాంల ఏర్పాటుతో పాటు తాత్కాలిక షెడ్లు నిర్మించాలి.

– బుచ్చయ్య, కూరగాయల వ్యాపారి, కడ్తాల్

సమస్యలు పరిష్కరిస్తాం



సంతకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో దశబ్దాలుగా గాంధీనగర్ కాలనీలోనే నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రత్యేక స్థలం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రత్యేక స్థలం లేకపోవడంతో షెడ్ల నిర్మాణం చేపట్టలేదు. సంతకు అనువైన స్థలం కేటాయించగానే మార్కెట్ నిర్మాణ పనులు చేపడుతాం. ప్రస్తుతం సంతలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

– లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్, కడ్తాల్

వడగండ్ల బాధితులను ఆదుకోండి

అదనపు కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి

ఇబ్రహీంపట్నం: వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని అదనపు జిల్లా కలెక్టర్ తిరుపతయ్యకు ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పటికీ ఇప్పటికీ ప్రభుత్వ ఒక అంచనాకు రాకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం పసల్ బీమా యోజన పథకాన్ని ష్ట ప్రభుత్వం అమలు పరచకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. దెబ్బతిన్న పంటలకు, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేపీ సీనియర్ నేత ఆచారి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పాపయ్యగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్సింహారెడ్డి, సుదర్శన్‌యాదవ్, నాయకులు.. నర్సింగ్‌రాజ్, రాంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పల్లె కృష్ణగౌడ్, నర్సింమారెడ్డి, దేశ్యానాయక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన గుంత శ్రీను గత సంవత్సర కాలంగా అనారోగ్యబారిన పడి జీవనం సాగిస్తున్నాడు. ఇతను గతంలో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. శ్రీను కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న సాటి డ్రైవర్లు అతడికి ఆర్థిక సహాయం చేయాలని అనుకున్నారు. డ్రైవర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రూ.10,000 విరాళాలు సేకరించారు. సంబంధిత డబ్బును గురువారం శ్రీనుకు అందజేశారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

మాజీ ఎమ్మెల్యే రాములు



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించనున్నట్లు సీపీఐ నేతలు అన్నారు. ఇబ్రహీంపట్నం డాగ్ బంగ్లాలో గురువారం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, సీపీఐ రాష్ట్ర కమిటీ సమితి నాయకులు కావలి నర్సింహ, ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలపై ఏప్రిల్ 14 నుంచి పాదయాత్రలు, జీపు జాతలు, బైక్ ర్యాలీలను నిర్వహించి ప్రజలను చైతన్య పరచనున్నట్లు చెప్పారు. ఫార్మాసిటీ భూబాధితులకు అండగా పోరాటం చేస్తామన్నారు. దేశంలో మతోన్మాద బీజేపీ అరాచకాలు పెరిగిపోయాయన్నారు. నిత్యావసరాల ధరలు కూడా పెరిగిపోయాయన్నారు. బీజేపీని గద్దె దించేతేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. శనివారం సీపీఐ విస్తృత స్థాయి సమావేశాన్ని భారత్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు అలీమొద్దిన్, మండల కార్యదర్శి యాదయ్య, మహిళా సంఘం జిల్లా నాయకురాలు నీలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

రేపు ప్రగతి నివేదన సభ

మంచాల: బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్రలో భాగంగా శనివారం నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ మంచాల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దఅంబర్‌పేట (ఓఆర్ఆర్‌సర్కిల్)లో బహిరంగ సభ ఉంటుందని.. ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మంచాల పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, యువజన విభాగం మండల అధ్యక్షుడు భద్రీనాథ్, నాయకులు రవి, శ్రీశైలం, జంగయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన శ్రావణికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.15,000 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం శ్రీనివాసుయాదవ్ చెక్కును శ్రావణికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ముజీబుర్ రహ్మాన్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, యాదయ్య, అశోక్, రాజు, శేఖర్, విజయ్, మల్లేశ్, వెంకటేశ్, జంగయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పోషణ పక్వాడ–పోషణ అభియాన్‌లో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జయమ్మ మాట్లాడుతూ.. రోజూవారి ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఎదిగె పిల్లలకు చిరుధాన్యాలను ఇవ్వాలన్నారు. చిరుధాన్యాలు తీసుకుంటే సరిపడా పోషకాలు లభిస్తాయని అన్నారు. నిత్యం చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తిరుమల, ఏఎన్ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్ అన్నమ్మ, విజయలక్ష్మి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తుర్కయంజాల్: నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ వైజాగ్ కాలనీలో నీటమునిగి బుధవారం చనిపోయిన తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడకు చెందిన గౌని శివకుమార్ గౌడ్ కుటుంబసభ్యులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. శివ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేష్.. శివకుమార్ మృతదేహానికి నివాళి అర్పించారు. శివకుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.30వేల ఆర్థిక సహాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, దశరథ, యాదిరెడ్డి, సంపతీశ్వర్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో గురువారం ఎన్ఆర్ఈజీఎస్, జెడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.33 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ అనిత, సర్పంచ్ అమర్‌సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో అంతర్గత మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శంకర్‌నాయక్, రవి, పత్యానాయక్, జ్యోతి, నీల, రవీందర్‌నాయక్, శంకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, శంకర్, సోన శ్రీనునాయక్, తులసీరాంనాయక్, విజయ్ పాల్గొన్నారు.

తైబజారు వేలం మరోసారి వాయిదా

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ తైబజారు వేలం మరోసారి వాయిదా పడింది. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో గురువారం 2023–24 సంవత్సరానికి మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. 9 మంది డీడీలు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. అయితే కేవలం రూ.12 లక్షలకు వేలంపాట పాడటంతో అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. గత ఏడాది తైబజారు వేలం రూ.19 లక్షలు పలికింది. ఈ ఏడాది రెండవసారి కూడా తక్కువగా రావడంతో తైబజారు వేలాన్ని వాయిదా వేశారు. తిరిగి తైబజారు వేలం నిర్వహిస్తామని తేదీని త్వరలో ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు



గ్రంథాలయం ప్రారంభోత్సవంలో ఎంపీపీ సుకన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎంపీపీ సుకన్య

యాచారం: పాఠశాల స్థాయి విద్యార్థులకు ఎంతో కీలకమని పుస్తకాలే నేస్తాలుగా భావించి కష్టపడి చదువుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. యాచారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం అమెజాన్ వెబ్ సిరీస్ వారు పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సమీకృత ఆరోగ్యం మరియు సామాజిక అభివృద్ధి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని ఎంపీపీ తెలిపారు. ప్రభుత్వం నుంచే కాక దాతలు ముందుకు వచ్చి గ్రంథాలయాల స్థాపనకు కృషి చేస్తే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గీత, హెచ్ఎం స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ హంసమ్మ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషితోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమవుతుందని కప్పపహాడ్ సర్పంచ్ సామల హంసమ్మ, ఎంపీటీసీ ఏనుగుభరత్‌రెడ్డి పేర్కొన్నారు . ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మునీర్, వార్డు సభ్యులు ఇందిర, పావని, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జలేందర్‌గౌడ్, వీరయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు .

వెంకట్రావ్‌పేటలో..

తలకొండపల్లి: గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సర్పంచ్ హైమావతిరమేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో ఆమె ఎస్ఎంసీ చైర్మన్ రమేష్‌తో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన రూ.5 లక్షల ఉపాధిహామీ నిధులతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు విష్ణు, పాండురంగయ్య, లక్ష్మమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, మహేష్, ఎల్లయ్య, ఈదన్న, వెంకటయ్య, బాలకృష్ణయ్య, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

‘వర్గీకరణ’ సాధించి తీరుతాం



తలకొండపల్లి చేరుకున్న సంగ్రామ పాదయాత్ర

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ పోతుగంటి కృష్ణ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఏప్రిల్ 4న హైదరాబాద్ దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ సన్నాహక పాదయాత్ర గురువారం తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్, గట్టుప్పలపల్లి, వెంకట్రావ్‌పేట్ గ్రామాల్లో పర్యటించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోతుగంటి కృష్ణ మాట్లాడారు. ఈ వర్గీకరణతో ఎస్సీల్లోని 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఏ,బీ,సీ,డీ వర్గీకరణతో అన్ని ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేష్, జగన్, ధనంజయ్, శ్రీశైలం, నవీన్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని జాతీయ రహదారిపై భగత్‌సింగ్ చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు రాములయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కానుగుల వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, నాయకులు శివశంకర్, పోచయ్య, లాలునాయక్, హంసమ్మ పాల్గొన్నారు.

ఆరుట్ల గ్రామంలో..

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో చండీశ్వర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం భగత్ సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు పోరాడిన తీరు, వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మధు, మహేష్, పరమేష్, నాగరాజ్, శ్రీకాంత్, నరేష్, గిరీష్, ఉదయ్, శ్రీశైలం, పవన్, కృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మంచాల: చండీశ్వర్ యూత్ ఆధ్వర్యంలో..



ఆమనగల్లు: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు